ఆనందంలో మత్స్యకారులు

- బంగాళాఖాతంలో రొయ్యలే.. రొయ్యలు
- పడుతున్న వెన్నామీ, టైగర్ రొయ్యలు
- కలిసొచ్చిన వేట

బాపట్ల: మత్స్యకారులకు రొయ్యల వేట పండుగ వాతావరణాన్ని తెచ్చింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా బంగాళాఖాతంలో వేట సక్రమంగా సాగని మత్స్యకారులకు ఈ ఏడాది రెండు నెలలుగా వేటలు కలిసొచ్చాయి. మత్స్య సంపదకు కొదువులేదన్న చందంగా వేటలు సాగుతున్నాయి. కోనమ్... చందవాలు...మొయ్య... పండు చేపలకు పరిమితమైన వేట కాస్తా రొయ్యలు పడటంతో వలలను సైతం వాటికి సిద్ధం చేసుకుంటున్నారు. సాధారణంగా ఆక్వా సాగులో 40 నుంచి 25 కౌంట్ చూడాలంటే రైతులకు ఎంతో కష్టంగా ఉంటుంది. అయితే సముద్రంలో ఇటీవల 20 కౌంట్ రొయ్యలు కూడా పడటంతో మత్స్యకారుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. సముద్రపు రొయ్యకు మంచి డిమాండ్ ఉండటంతో సముద్ర తీరంలోని ఓడరేవు మార్కెట్ రొయ్యల మార్కెట్‌తో కళకళలాడుతుంది. సంపద బాగా పడటంతో నాలు గైదు రోజులు సముద్రంలో వేట చేసే మత్స్యకారులు రెండు, మూడు రోజులకే వేట ముగించుకుని బయటకు వచ్చి మళ్లీ వేటకు వెళుతున్నారు.

డిస్కో వలలతో వేట

బాపట్ల మండలంలోని అడవిపల్లెపాలెం, కృపానగర్, దాన్వాయ్‌పేట, ఓడరేవులలో వేట వేగవంతంగా సాగుతుంది. ఈ ప్రాంతంలో మూడు వేల కుటుంబాలు ఉండగా 800 వరకు వేట సాగించే పడవులు ఉన్నాయి. చేపల వేటకు ఉపయోగించే వలలు కాకుండా రొయ్యలకు డిస్కో వలలను ఉపయోగించటం వలన రొయ్యల వేట సంతృప్తికరంగా ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఒక్కొక్క పడవకు 8 నుంచి 10 మంది వేటకు వెళుతున్నారు. వెనామీ రొయ్య, టైగర్ రొయ్యలు పడవల్లో పడుతున్నాయి. 400 కేజీలు వెనామీ రొయ్యలు పడితే వాటిలో 40 నుంచి 50 కేజీలు టైగర్ రొయ్య అదీ 20 నుంచి 40 కౌంట్ ఉన్న రొయ్యలు పడుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వెనామీ 40 కౌంట్ రొయ్యలకు రూ.480 నుంచి రూ.500 ఉండగా, టైగర్ రొయ్య 20 కౌంట్‌కు రూ.500 నుంచి రూ.600 ధర పలుకుతుంది.



వేటకు వెళుతున్న మత్స్యకారులు

రొయ్యల ధరలు ప్రస్తుతం ఇలా...

కౌంటు	ధర(రూపాయలలో)
100	200
90	210
80	220
50	240
40	480-500
20	500-600



వెనామీ రొయ్యలు



తక్కువ దూరంలోనే

వాతావరణం అనుకూలంగా ఉండటంతో సముద్ర తీరం నుంచి 20 నుంచి 30 కిలోమీటర్లు వెళ్లే సరికే మత్స్య సంపద పడటంతో ఖర్చులు కూడా కొద్దిగా తగ్గుతున్నాయి. ఒక్కసారి వేటకు వెళితే గతంలో రూ.25 నుంచి రూ.30 వేలు ఖర్చు అవుతుండగా ఇప్పుడు రూ.20 వేల లోపే ఖర్చు అవుతోంది.

– జి.అప్పలరాజు, మత్స్యకారుడు



ఓడరేవులోనే మార్కెట్

రొయ్యలు ఎక్కువ పడటంతో చీరాల ఓడరేవుకే ఎక్కువ మంది కొనుగోలుదారులు వస్తున్నారు. వారం రోజుల లోపు కొనుగోలు చేసిన వాటికి నగదు చెల్లిస్తున్నారు. ఐస్, సబ్సిడీపై డీజిల్ అందిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాం.

– చొక్కా సత్యనారాయణ, మత్స్యకారుడు

క్లుప్తంగా

వైభవంగా ఆరెమండ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల



పొన్నూరు: మండలంలోని ఆరెమండలోని ఆరెమండ్లమ్మ అమ్మవారి మందిర వార్షిక తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారి జాతర, మొక్కుబడులు, పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆరెమండ శ్రీ గ్రామ దేవత నాట్యమండలి వారు ప్రదర్శించిన సామ్రాట్ సాంఘిక నాటకం ఆకట్టుకుంది.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అప్పాపురం(కాకుమాను): సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డాక్టర్ డి.విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని అప్పాపురం, రేటూరు గ్రామాలలో ఆదివారం బాపట్ల జిల్లా డాక్టర్ ఎన్.టి.ఆర్.వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆవశ్యకతను వివరించారు. గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ కె.లావణ్య, కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్.అశోక్ రాకేష్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు



తెనాలిటౌన్: బాలాజీరావుపేట అయ్యప్పపురం ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో దుర్భ హరిబాబు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్నంగి(కొల్లిపర): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పెద్ద ఆరిగ కోటిరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి అన్నారు. ఆదివారం మున్నంగి గ్రామంలో తెనాలి పట్టణంలోని దివి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును గ్రామ పెద్దలు ఆరిగ కోటిరెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు.

138 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

నిజాంపట్నం: మానవ శరీరంలో ముఖ్యమైన అవయవాలలో కళ్లకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వీటిని సంరక్షించుకోవటంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజాంపట్నం బ్రాంచ్ చైర్మన్ కాళ్ళేపల్లి గౌరీశంకర్ అన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజాంపట్నం ఆధ్వర్యంలో మండల కేంద్రం నిజాంపట్నంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కంటికి సంబంధించి ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సొంత చికిత్సలు మానుకుని వైద్యుని సంప్రదించి చికిత్స పొందాలని చెప్పారు. ఈ సందర్భంగా శిబిరంలో 138 మందికి వైద్యురాలు మేఘన సేవలు అందించగా వీరిలో 82 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని చెప్పారు. వీరిలో తొలి విడతగా 30 మందికి శంకర్ కంటి ఆసుపత్రిలో చికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ కొల్లిపర్ర బాబ్జీ, సభ్యులు దబ్బకూటి సాయితేజ, కొల్లిపర్ర శ్రీనివాసరావు, టి.రవి, కె.గోపి, బాజీ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందుకున్న చిన్నారులు, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు

రోటరీ అధ్యక్షుడు ఉపేంద్రగుప్త



మహిళలను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బాపట్ల : మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ముందుకు పోవాలని రోటరీ క్లబ్ బాపట్ల అధ్యక్షుడు ఉపేంద్రగుప్త పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఉపేంద్రగుప్త మాట్లాడుతూ మహిళలు ఎక్కడైతే పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి వేజండ్ల శ్రీనివాసరావు, డాక్టరు ఎస్.త్రివేణి, సీనియర్ రోటరీ సభ్యులు ఇ.హరిబాబు, బుర్లె రామ సుబ్బారావు, రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు, కొత్త సుబ్బారావు, కొత్త ఆంజనేయ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

రేపల్లె రూరల్: గృహిణిగానే కాకుండా పలు రంగాల్లో రాణిస్తూ మహిళలు గర్వించదగిన విధంగా ఎదిగారని ఆర్యవైశ్య మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మద్ది పద్మజ అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో ఆమె మాట్లాడారు. విద్యార్థిని స్థాయి నుంచి ఉపాధి అవకాశాలలో సైతం పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పలువురు మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహిళా సంఘం స్టేట్ ట్రెజరర్ పొన్నూరు గౌరీరామకుమారి, పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కె.సత్యవతి, సెక్రటరీ నాగలీల, ట్రెజరర్ కేఎస్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కాకుమాను: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని పుస్తక పఠనం వలన మానసిక ప్రశాంతత, మేధాశక్తి పెంపొందుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం అంటే మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు మానవ జీవితాన్ని మార్చే అద్భుత శక్తి ఉందని విద్యార్థులతో పాటు ప్రజలు కూడా ప్రతి రోజు కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గారపాటి రమేష్, గ్రంథాలయ నిర్వాహకురాలు సుభాషిణి, వెలినేని శివయ్య, మేడిద రవి, ఎన్.మల్లిక, జి.మంజుల పాల్గొన్నారు.

12 నుంచి అగస్త్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని అగస్త్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు తుర్లపాటి ప్రసన్నాంజనేయశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారిని పెండ్లికుమారుడిని చేయటం, అంకురార్పణ, ధ్వజారోహణం ప్రత్యేక అలంకారంలో భక్తులకు స్వామి దర్శనం ఉంటుందని వివరించారు. 13వ తేదీన ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, బలిహారణ, ఎదురుకోల ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి ఒంటి గంటకు స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 14న ప్రత్యేక పూజలతోపాటు స్వామి తలంబ్రాలోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీన పూజలు, అభిషేకాలు, హోమాలతో పాటు స్వామివారి వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కావున భక్తులు స్వామి కల్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరారు.

మహాయజ్ఞం పూర్ణాహుతి ప్రారంభం



తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం ఘనంగా ఆరంభమైంది. స్థానిక తాలూకా హైస్కూలు గ్రౌండ్‌లో ఆరురోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పూర్తిచేసిన 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలను ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్రను శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుండి బయలుదేరింది. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి జరిగే తెనాలి తాలూకా హైస్కూలు మైదానంలోని వేదిక వరకు శోభాయాత్ర సాగింది. అక్కడ సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహం, దీక్షా ధారణ, అంకురారోపణను వైఖానసాగమోక్తంగా జరిపారు. సోమవారం ఉదయం ఆరుగంటలకు గోపూజతో వేడుకలు ఆరంభమవుతాయనీ, శ్రీసీతారాములకు పంచామృత స్నపన తదుపరి ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. భక్తజనులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. 11.30కు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తిచే ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 6.45 గంటలకు అవధాన సరస్వతీపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని వివరించారు. శోభాయాత్రలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

12న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా



కరపత్రాలను ఆవిష్కరించిన ఈమని అప్పారావు, కార్మిక సంఘ నాయకులు

లక్ష్మీపురం: ఉపాధి హామీ చట్టం రక్షణ–వ్యవసాయ కార్మికుల డిమాండ్ సాధన కోసం మార్చి 12వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని జిల్లా సంఘ కార్యాలయంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు ఉపయోగకరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్లో నిధులు తగ్గించిందని తెలిపారు. ఉపాధి హామీలో యంత్రాలు, కాంట్రాక్ట్ విధాన రద్దు చేయాలని, వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, అవినీతిని అరికట్టాలని, మస్టర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని, ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు గుర్తింపు కార్డు ఇచ్చి ఉచిత రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ బండ అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ బి.కోటేశ్వరి, మంగళగిరి అధ్యక్షులు జి.అజయ్, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

గేదెల దొంగలు అరెస్ట్



మాట్లాడుతున్న రూరల్ సీఐ హరికృష్ణ, ఎస్ఐ రవీంద్ర

కర్లపాలెం: మండలంలో సంచలనం రేపిన గేదెల దొంగతనం కేసులో దొంగలను కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర సిబ్బంది కలసి చాకచక్యంగా ఛేదించారని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండల పరిధిలోని చింతాయపాలెం గ్రామంలో కాగిత ముక్కంటికి చెందిన మూడు గేదెలు, మూడు దూడలను ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. ముక్కంటి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసుకుని చాకచక్యంగా దర్యాప్తు చేసి దొంగతనం చేసిన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంకి చెందిన బైరబోయిన వెంకటేశ్వర్లు, అంబటి అనిల్, సాయిచంద్ అనే వ్యక్తులను గుర్తించి 9వ తేదీన అరెస్ట్ చేశారని తెలిపారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తూషార్ డూడీ, డీఎస్పీ రామాంజనేయులు, సీఐ హరికృష్ణల సూచనల మేరకు సీసీ కెమెరాలను పరిశీలించి దొంగలను గుర్తించి యర్రగొండపాలెంలో వారిని అదుపులోకి తీసుకోవటంతో పాటు మూడు గేదెలను, ఒక దూడ చనిపోవటంతో రెండు దూడలను తీసుకువచ్చామని తెలిపారు. గేదెలను తీసుకువెళ్లేందుకు ఉపయోగించిన టాటా ఏస్ వాహనాన్ని, గ్లామర్ బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు





నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 26వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన అంకురారోపణతో ప్రారంభమై, 12న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల శ్రీవారి దివ్య శాంతి కల్యాణోత్సవం, 13న మేళతాళాలు, జానపద కళా రూపాలతో అపూర్వ రథోత్సవం, 14న చండీ హోమం, పూర్ణాహుతి, అన్న సమారాధన, శ్రీపద్మావతి అమ్మవారికి విశేష అభిషేకాలు, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, స్వామిజీలు, పీఠాధిపతులు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

మంగళగిరి టౌన్ : అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని మంగళగిరి పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. పట్టణ ఎస్ఐలు రవీంద్రనాయక్, హరిబాబు, క్రైం సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, శ్రీరామ్ ఉన్నారు.

యువకుడిపై దాడి

తెనాలిరూరల్: తీన్‌మార్ కొడుతున్న యువకుడిపై ఇద్దరు దాడి చేసి గాయపర్చారు. పట్టణానికి చెందిన నరసింహ ఆదివారం ఓ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతుండగా రామలింగేశ్వరపేటలోని రైస్‌మిల్లు సమీపంలో తీన్‌మార్ ఆపాలంటూ జూపల్లి వంశీ, ప్రమోద్ నరసింహతో వాదనకు దిగి, రాయితో గాయపర్చారు.

మేల్ చేసే పొదుపు

- పురుషుల పొదుపు సంఘాల ఏర్పాటుకు శ్రీకారం
- తెనాలి పట్టణంలో మొత్తం 39 గ్రూప్‌ల ఏర్పాటే లక్ష్యం
- నేటికి 21 గ్రూప్‌ల ఏర్పాటు
- ఈ నెల 22వ తేదీలోపు మిగిలిన గ్రూప్‌ల ఏర్పాటుకు చర్యలు

తెనాలిఅర్బన్: నేటి సమాజంలో ఎక్కువగా వినిపించే మాట పొదుపు. ఇప్పటి వరకు ప్రభుత్వం మహిళలతో పొదుపు చేయించి వారికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించటం.. ప్రోత్సాహాలు ఇవ్వటం చేస్తూ వస్తోంది. ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పురుషులకు ఇలాంటి గ్రూపులు ఏర్పాటు చేయించి వారితో పొదుపు చేయించే పనికి శ్రీకారం చుట్టింది. దీంతో మెప్మా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.

తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు 2,880కి పైగా స్వయం సహాక సంఘాల మహిళా గ్రూపులు ఉన్నాయి. వీటిలో సుమారు 28వేల మందికిపైగా సభ్యులుగా ఉన్నారు. వీరందరూ ప్రతినెలా పొదుపు చేస్తూ ఆరు నెలల తర్వాత బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందుతారు. వాటిని నెలనెలా చెల్లిస్తూ వాయిదాలు పూర్తికాగానే మళ్లీ రుణాలు తీసుకోవటం జరుగుతూ వస్తోంది. అదే తరహాలో ప్రభుత్వం పురుషులకు పొదుపు గ్రూపులు ఏర్పాటు చేయాలని గతేడాది డిసెంబర్ 22న ఆదేశించారు. గుంటూరు తర్వాత అతి పెద్ద పట్టణంగా తెనాలి పట్టణం మారటంతో ఇక్కడ మొదటి విడత కింద 39 గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఐదుగురే గ్రూపు సభ్యులు

మహిళకు సంబంధించిన గ్రూప్‌లో 10 మంది సభ్యులు ఉంటారు. కానీ పురుషులకు సంబంధించిన గ్రూప్‌లో ఐదుగురు మాత్రమే ఉంటారు. వీరిలో యాక్టివ్‌గా ఉన్న వారిని అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకుని గ్రూప్‌కు ఒక పేరు పెడతారు. తర్వాత గ్రూప్ పేరుతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించి ప్రతి ఒక్కరితో ప్రతినెలా రూ.200 పొదుపు చేయిస్తారు. ఆరు నెలల తర్వాత వారికి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

21 గ్రూపులు ఏర్పాటు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లు ఇంటింటి సర్వే నిర్వహించారు. తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు 21 గ్రూపులు ఏర్పాటు చేయించారు. మిగిలిన 18 గ్రూపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 21వ తేదీలోపు మిగిలిన గ్రూపులు ఏర్పాటు చేయనున్నారు.



గ్రూప్ సభ్యుల ఎంపిక ఇలా...

పురుషుల పొదుపు సంఘాల గ్రూపులను ఆరు కేటగిరీలుగా ఏర్పాటు చేశారు. వారిలో మొదటి కేటగిరి కింద కార్పెంటర్లు, ప్లంబర్‌లు, తాపీ పని చేసే వారు. పెయింటర్స్, ఇతర బిల్డింగ్ వర్కర్ ఉంటారు. రెండో కేటగిరి కింద మున్సిపల్ కార్యాలయం పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, వారి భర్తలు, మూడో కేటగిరి కింద అమేజాన్, స్విగ్గీ, జొమాటో తదితర సంస్థల డెలివరి బాయ్‌లు, నాలుగో కేటగిరి కింద వృద్ధులు, చిన్న పిల్లలకు కేర్ టేకర్‌లుగా పనిచేసే వారు, ఐదో కేటగిరి కింద ఎలక్ట్రీషియన్‌లు, ఏసీ, ఫ్రిజ్, గృహోపకరణాలు రిపేర్ చేసేవారు, ఆరో కేటగిరి కింద మున్సిపాలిటీ, కార్పొరేషన్, పంచాయతీలలో పనిచేసే డ్రైవర్లు ఉంటారు. వీరి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలి. ఈ ఆరు కేటగిరిలలో పనిచేసే స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యుల భర్తలకు కొంత ప్రాధాన్యం ఇస్తున్నారు. భార్య, భర్తలు గ్రూప్‌లలో ఉంటే రుణాల చెల్లింపులు సకాలంలో జరుగుతాయనే భావనతో ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

అర్హులు గ్రూపుల్లో చేరాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు పురుషుల పొదుపు సంఘాల గ్రూపులు ఏర్పాటు చేసే ప్రక్రియ తెనాలిలో జరుగుతోంది. ఇప్పటికే 21 గ్రూపులు ఏర్పాటు చేశాం. మిగిలిన గ్రూపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రూపుల ఏర్పాటుతోపాటు వీటి నిర్వహణ బాధ్యతలు ఆర్పీలు చూస్తారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం అర్హులైన వారు తనను, ఆర్పీలను సంప్రదిస్తే వెంటనే గ్రూపులను ఏర్పాటు చేస్తాం. వీటి వల్ల పురుషులలో కూడ పొదుపు చేసే లక్షణం మరింత అలవడే అవకాశం ఉంది.

–గుంటూరు విజయ కుమారి,
మెప్మా విభాగ సిటి మిషన్ మేనేజర్, తెనాలి పురపాలక సంఘం